సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 30 । జనవరి । 2025



ముహూర్తాలకు వేళాయె..
నేటి నుంచి మాఘమాసం ప్రారంభమవుతుండగా, శుక్రవారం నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. 8లో



ఇబ్బందులు లేకుండా చూడాలి
ఆశ్రమ గిరిజన వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. 8లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం 33° / 16°
జిల్లాలో గురువారం మధ్యాహ్న ఉష్ణోగ్రతలు కొంతమేర పెరుగుతాయి. ఉదయం మంచు, రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం జరిపించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జేఈఈ మెయిన్స్ ప్రశాంతం



హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 120 మందికి ఉదయం షిఫ్ట్‌లో 117 మంది హాజరుకాగా, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 119 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

డీడీఎన్ నిధులు విడుదల

ఖమ్మంగాంధీచౌక్ : వెనుకబడిన ఆలయాల నిర్వహణకు రూపొందించిన ధూప దీప నివేదన(డీడీఎన్)పథకం నిధులు విడుదలయ్యాయి. 2024 నవంబర్, డిసెంబర్ నెలల పెండింగ్ బకాయిలను అర్చకుల ఖాతాల్లో దేవాదాయ శాఖ అధికారులు జమ చేశారు. ఖమ్మం జిల్లాలోని 330, భద్రాద్రి జిల్లాలోని 120 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున వారి ఖాతాల్లో జమయ్యాయి.

'ఎస్సారెస్పీ' భూసేకరణకు అధికారుల పరిశీలన



భూసేకరణపై చర్చిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 54వ ప్యాకేజీలో సేకరించాల్సిన భూముల కోసం మండలంలోని ఇస్లావత్‌తండా నుంచి తిరుమలాయపాలెం వరకు ఆయా గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాల్వలను సీడబ్ల్యూసీ అధికారులు శ్రీనివాస్, శరణ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత భూముల విలువ, ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలపై స్థానిక ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. పాలేరు నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో ఇంకా 15 ఎకరాల భూమిని కాల్వల నిర్మాణం కోసం సేకరించాల్సి ఉండగా, ఎన్ని నిధులు అవసరమనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈలు బాణాల రమేష్‌రెడ్డి, మన్మథరావు, ఏఈ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరేనా..?

నత్తనడకన ఇంటి పన్ను వసూళ్లు
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అదే పరిస్థితి
- మార్చితో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- అధికారులు ప్రణాళికతో ముందుకు సాగితేనే ఆదాయం





కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీల వారీగా పన్ను వసూళ్ల వివరాలు (రూ. లక్షల్లో..)

మున్సిపాలిటీ	వార్డులు	డిమాండ్	వసూళ్లు	జనాభా
కొత్తగూడెం	36	544.16	287.24	లక్షపైన
పాల్వంచ	24	526.46	247.18	లక్ష
ఇల్లెందు	24	116	79	40,105
మణుగూరు	20	145	81	40,000

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఏ పురపాలిక కూడా లక్ష్యానికి చేరువలో లేదు. మరోవైపు మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆ లోపే పూర్తి చేయాల్సి ఉన్నా అధికారులు దృష్టి సారించడంలేదు. మున్సిపాలిటీల్లో ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోంది. నూరుశాతం పన్ను వసూళ్లుకాక, బకాయిని తర్వాత ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో కలపడంతో.. వసూళ్ల భారం ఇంకా పెరిగిపోతోంది. ప్రజలపై వడ్డీ భారం కూడా పడుతోంది. అలాకాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి ఏ ఏడాది పన్ను అదే ఏడాదిలో వసూళ్లు పూర్తి చేస్తే సిబ్బందితోపాటు ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. ప్రజలు కూడా ముందస్తుగా ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

బిల్ కలెక్టర్ల కొరతతో వెనుకబాటు..
గతంలో నాలుగు మున్సిపాలిటీల్లో కూడా బిల్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఇంటింటికీ తిరిగి ఇంటి పన్ను వసూళ్లు చేసే వారు. అయితే బిల్ కలెక్టర్ల కొరతతో పూర్తిస్థాయిలో పన్ను వసూళ్లు కావడంలేదు. ప్రస్తుతం జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు నూతనంగా వార్డు ఆఫీసర్లను నియమించారు. ఈ నేపథ్యంలో బిల్ కలెక్టర్లు తక్కువగా ఉన్న ప్రాంతంలో వార్డు ఆఫీసర్ల సేవలను వినియోగించి పన్ను వసూళ్లు చేస్తే వందశాతం లక్ష్యం పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వే, వార్డు సభలతోనే జనవరి గడిచిపోయింది. ప్రస్తుతం కూడా అదే ప్రక్రియకు సంబంధించిన పెండింగ్ పనులు చేస్తున్నారు. దీంతో ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించడంలేదు.

మొండిబకాయిలతో అవస్థలు
మున్సిపాలిటీల్లో ఏటా 90 శాతం వరకు ఇంటి పన్ను వసూళ్లు చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలల్లో దృష్టి సారిస్తే మొండి బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంటుంది. పన్ను ఆదాయం రాకపోవడంతో మున్సిపల్ ఉద్యోగులకు వేతనాలు, ఇతర అభివృద్ధి పనులకు ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో అధికారులు మున్సిపల్ జనరల్ ఫండ్‌ను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలుగు మున్సిపాలిటీల్లోని 50 మందిబిల్ కలెక్టర్లు, 57 మంది వార్డు ఆఫీసర్లు.. మొత్తం 107 మందితో ఇంటింటికీ తిరిగి పన్ను వసూళ్లు చేస్తే మున్సిపాలిటీల ఆదాయం మెరుగుపడుతుంది. మార్చిలో ఎండ తీవ్రత కూడా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులతో వసూళ్లు చేయించగలిగితే పన్ను లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.

వందశాతం వసూలు చేస్తాం



కొత్తగూడెం మున్సిపాలిటీలో వందశాతం పన్నులు వసూలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. ఇందుకోసం బిల్ కలెక్టర్లను, రెవెన్యూ అధికారులను, వార్డు ఆఫీసర్ల సేవలను వినియోగించుకుంటున్నాం. మార్చిలోగా లక్ష్యం చేరుకుంటాం. ప్రజలు కూడా సహకారం అందించి ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలి.
–శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

పోరుబాటలో 'ఉపాధి' సిబ్బంది

- సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు
- వచ్చే నెల 12 వరకు ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె
- మూడు నెలలుగా వేతనాలు అందక అవస్థలు
- జిల్లా వ్యాప్తంగా 219 మంది సిబ్బంది



దమ్మపేటలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి సిబ్బంది

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది నిరసన బాట పట్టారు. సకాలంలో వేతనాలు అందక అధికారులు, సిబ్బంది ఆందోళనకు దిగారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలకు వినతి పత్రాలు సమర్పించారు. సమస్యలను విన్నవించారు. ఆందోళన కార్యక్రమాలను వచ్చే నెల 12 వరకు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. 29, 30 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓలు, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేత, 31, ఫిబ్రవరి 1న దిబ్బంది పెన్‌డౌన్, 2,3 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను, 4న కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించడం, 5న కలెక్టరేట్ ఎదుట నిరసన, 6న టీఎన్జీవో, టీజీవో ఉద్యోగ సంఘాల నేతలకు వినతి పత్రాలు, 7న ప్రజా భవన్‌లో వినతిపత్రం, 8న హైదరాబాద్‌లోని పీఆర్ అండ్ సీఆర్‌డీ కమిషనర్ కార్యాలయంలో వినతులు, 9,10 తేదీల్లో మంత్రులకు వినతి పత్రాలు, 11న కమిషనర్ పీఆర్ అండ్ సీఆర్‌డీ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తదితర కార్యక్రమాలు చేపట్టాలని, 12న కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేయాలని నిర్ణయించారు. అప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు.

వేతన వెతలు..
జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మొత్తం 219 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఏపీవోలు 21 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 21 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 105 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 72 మంది ఉన్నారు. వీరికి గత నవంబర్ నుంచి వేతనాలు అందడంలేదు. ప్రతినెలా ఎఫ్‌టీఓ(ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జనరేట్ చేసి పంపుతున్నా వేతనాలు విడుదల చేయడం లేదు. రాష్ట్రశాఖలో బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యమవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటుండగా, సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవటంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులరైజేషన్ చేయాలని, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఉపాధి సిబ్బంది నిరసనతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు, ఉపాధి పనులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. జిల్లాలో నిర్దేశించిన పనిదినాల లక్ష్యం మార్చి 31 లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. కూలీలను పనులకు రప్పించటం, హాజరు నమోదు చేయడం వంటి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.

ఇబ్బంది పడుతున్నాం



ఉపాధి హామీ పథకం సిబ్బంది వేతనాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు సకాలంలో జీతాలు అందుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.
–పిల్లి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్, చుంచుపల్లి

వచ్చే నెల 12 వరకు నిరసనలు



న్యాయపరమైన సమస్యలతో పాటు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆందోళనలు చేపడుతున్నాం. వచ్చే నెల 12 వరకు రోజువారీగా ఆందోళనలు కొనసాగిస్తాం. శాంతియుత నిరసనల ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులను అందరినీ కలుస్తాం.
–రఘుపతి, ఏపీఓ, చుంచుపల్లి

అటవీ అనుమతులు రాగానే రహదారి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



రహదారి ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం/బూర్గంపాడు: మారుమూల అటవీ గ్రామమైన శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి అటవీశాఖ అనుమతులు రాగానే రహదారి సౌకర్యం కల్పిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. సారపాకకు సమీపంలోని శ్రీరాంపురం ఎస్టీకాలనీకి రహదారి సౌకర్యం కల్పించేందుకు బుధవారం ఫారెస్ట్ అధికారులతో కలసి ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో 67 కుటుంబాలకు చెందిన 270మంది ఆదివాసీలు ఉంటున్నారని, వీరికి రహదారి సౌకర్యం లేకపోవటంతో ప్రతిఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. రహదారి నిర్మాణానికి 2.37 కిలోమీటర్ల వరకు అటవీశాఖ అనుమతులు అవసరంకాగా, ప్రతిపాదనలను పంపించామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున పనులు ప్రారంభం ఆలస్యమవుతుందని అన్నారు.

గిరిజన మహిళల స్వయం ఉపాధి భేష్
ఏజెన్సీలోని గిరిజన మహిళలు స్వయం ఉపాధి సాధనలో ముందంజలో ఉండడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. భద్రాచలం ఎంపీడీఓ కార్యాలయంలో నెలకొల్పిన శ్రీ లక్ష్మీ గణపతి మహిళ ట్రైబల్ లియబిలిటీ గ్రూప్ న్యూట్రిషన్ మిక్స్, డ్రై మిక్స్ యూనిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డ్రై మిషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ గిరిజన యువతులు రూ.40 లక్షల ఖర్చుతో యూనిట్ ప్రారంభించారని, ఇందులో రూ. 24 లక్షల సబ్సిడీ వచ్చిందని చెప్పారు. అనంతరం సూరప్ప ఫ్లై యాష్ మేకింగ్ బ్రిక్స్ యూనిట్ నిర్మాణానికి రెండో విడతగా విడుదలైన రూ.9 లక్షల చెక్కును యూనిట్ సభ్యులకు అందజేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నందున త్వరగా ఇటుకల తయారీ యూనిట్ నిర్మించి, విక్రయించాలని సూచించారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి
దుమ్ముగూడెం : నూతన మెనూ అమలు చేయాలని, 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశించారు. బుధవారం మండలంలోని రామచంద్రుని పేట గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంటశాలను, పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి పిల్లలతో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్ట్‌పై పట్టు సాధించాలని చెప్పారు. మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు డేవిడ్‌రాజ్, మసూద్, ముజాహిద్, సునీల్, రమేష్, మహేష్, హరికృష్ణ, రామ్ కుమార్‌తోపాటు రామమ్మ, రాధమ్మ, క్రాంతి, ఆంజనేయులు, మానస, రాధమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు, హెచ్ఎం బట్టు రాములు, వార్డెన్ అరుణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ' పరిశీలన పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులతో కలిసి సంక్షేమ పథకాల అమలు, పీఎం కుసుమ్ పథకం, వేసవిలో నీటికొరత రాకుండా తీసుకోవాల్సి చర్యలు, ప్లాంటేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల దరఖాస్తులను గురువారంలోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కొత్తగా వచ్చిన 3,403 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఈ నెల 31వ తేదీ లోపు నివేదిక అందించాలన్నారు. బ్యాంకు అకౌంట్ నంబర్ల నమోదులో తప్పులను సరిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా వివరాలను అందించాలని ఆదేశించారు. పీఎం కుసుమ్ పథకం అమలులో భాగంగా సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు నాలుగు ఎకరాల భూమి అవసరం ఉంటుందని, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ స్థాపన చేస్తే 90 శాతం సబ్సిడీ వస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పవర్ ప్లాంట్ల స్థాపనకు జిల్లాకు 150 ఎకరాలు లక్ష్యంగా ఇచ్చిందని తెలిపారు. వేసవి నీటి కొరత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. హరిత హారం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, హౌసింగ్ పీడీ శంకర్, ఇండస్ట్రీస్ జీఎం తిరుపతయ్య, ఎల్‌బీఎం రామిరెడ్డి, డీఈఓ వెంకటేశ్వరాచారి, సెర్ప్ పీడీ నీలేష్, అడిషనల్ డీఆర్‌డీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

మోగిన నగారా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, ఆ రోజు నుంచి 10 వరకు నామినేషన్లు
- 11న పరిశీలన.. 13న ఉపసంహరణ
- 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు

ఖమ్మం సహకారనగర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేయడంతో కోలాహలం మొదలైంది. ఇప్పటి వరకు పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారం చేయగా.. షెడ్యూల్ ప్రకటనతో ఆశావహులు ప్రచారం ముమ్మరం చేయనున్నారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇటీవల ఓటర్ల నమోదు ప్రక్రియ ఇటీవలే పూర్తయింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 24 పోలింగ్ బూత్‌లు ఉండగా 3,955 మంది ఓటర్లుగా తేలారు. ఇందులో పురుషులు 2,300, మహిళలు 1655 మంది ఉన్నారు. భద్రాద్రి జిల్లాలో 23 మండలాల పరిధిలో 23 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 1,949 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,038 మంది, మహిళలు 941 మంది ఉన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే ఈనెల 31 వరకు కూడా ఓటు నమోదుకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

అమల్లోకి వచ్చిన కోడ్..
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లవుతుంది. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీఎంసీ), వీడియో సర్వైలెన్స్ టీమ్(వీఎస్‌టీ) ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుండగా ఆ రోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 13 వరకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, మార్చి 3న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

ఎవరికీ పట్టని 'ఉద్యానం'!

- జిల్లాలో మిర్చి, మామిడి, కూరగాయల సాగు
- మార్కెటింగ్‌కు, నిల్వలకు అవకాశాల్లేక అవస్థలు
- ఫలితంగా తక్కువ ధరకే కొంటున్న వ్యాపారులు
- కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని కోరుతున్న రైతులు



పూత దశలో ఉన్న మామిడితోట

ఇల్లెందురూరల్: జిల్లా ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా ఉద్యాన పంటలకు తగిన ప్రోత్సాహం లభించడంలేదు. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్, నిల్వలకు కోల్డ్ స్టోరేజీలు లేవు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతోంది. ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 25వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇక మామిడి పంట ఉమ్మడి జిల్లాలో 53 వేల ఎకరాల్లో సాగవుతుండగా, ఖమ్మం జిల్లాలో 42 వేల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 11 వేల ఎకరాల్లో సాగవుతోంది. కూరగాయలు భద్రాద్రి జిల్లాలో సుమారు 15వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాల్లో పదివేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం లేక..
మిర్చి, మామిడి పంటలకు, కూరగాయలకు జిల్లాలో కనీసం మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ధర వచ్చే వరకు కూరగాయలతోపాటు మిర్చి పంటను భద్రపర్చుకునేందుకు జిల్లాలో ఒక్క కోల్డ్‌స్టోరేజీ కూడా లేదు. ఇందుకోసం ఖమ్మం జిల్లా వెళ్లాల్సివస్తోంది. మిర్చి విక్రయాలకు కూడా ఖమ్మం మార్కెట్‌కు తరలించాల్సి వస్తోంది. ఇక మామిడిని ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ మార్కెట్లకు తరలిస్తున్నారు. దీంతో ఉద్యాన రైతులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది.

ఉద్యానవన అధికారుల పర్యవేక్షణేది..?
మూడేళ్లుగా మిర్చి, మామిడి పంటలను, కూరగాయల తోటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. నల్లి ప్రభావం అధికంగా ఉండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఈ తరుణంలో రైతులకు మెళకువలు చెప్పి అప్రమత్తం చేయాల్సిన ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. ఫలితంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

సాగుకు సెలవు ప్రకటించినా..
మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో స్థానికంగా వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విక్రయాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వ్యాపారుల మాయాజాలంతో కనీసం పెట్టుబడి కూడా ఎల్లని పరిస్థితి ఎదరవుతోంది. ఇలా వరుసగా నష్టాలు రావడంతో గతేడాది జిల్లాలోని అత్యధిక సంఖ్యలో రైతులు కూరగాయల సాగుకు సెలవు ప్రకటించారు. అయినా ఉద్యానశాఖతోపాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు.

అందుబాటులోలేని కోల్డ్ స్టోరేజీలు
జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. అనుబంధంగా గోదాములను సైతం నిర్మించారు. కానీ ఎక్కడా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఇతర పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలైన మిర్చి, పండ్లు, కూరగాయల కొనుగోలుకు కోల్డ్‌స్టోరేజ్ అందుబాటులో ఉండటం తప్పనిసరి. కానీ జిల్లాలో వాటి నిర్మాణంపై మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

విక్రయమే అసలు సమస్య



దశాబ్ద కాలంగా కూరగాయలు పండిస్తున్నాం. పంట ఉత్పత్తులను విక్రయించడం సమస్యగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది.
– మంచె రమేష్, రైతు, ఇల్లెందు మండలం

కోల్డ్‌స్టోరేజీలు నిర్మించాలి



ఉద్యాన పంటలు కోయగానే విక్రయిండం సాధ్యం కాదు. కోసిన పంటను ధర పలికే వరకు భద్రపరుచుకునేందుకు జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. ప్రతి వ్యవసాయ మార్కెట్ లోనూ ఒక కోల్డ్‌స్టోరేజీ నిర్మించాలి.
– బానోత్ సంతు, రైతు, ఇల్లెందు మండలం

క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు స్పందన

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. ఇల్లెందు నుంచి మాణిక్యారానికి, ఇల్లెందు నుంచి గుండాల మీదుగా శెట్టుపల్లికి బస్సు కావాలని కోరారు. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్లే పల్లెవెలుగు సర్వీస్‌ను పడమటి నర్సాపురంలోని హాస్టల్ దగ్గర బస్సు ఆపాలని, ఖమ్మం నుంచి వయా ఇల్లెందు, కొత్తగూడెం మీదుగా మణుగూరుకు బస్సు కావాలని పలువురు సూచించారు. భద్రాచలం, మణుగూరు నుంచి వచ్చే ప్రయాణికులకు కొత్తగూడెం కలెక్టర్ ఆఫీస్ దగ్గర బస్సులు ఆపాలని, కొత్తగూడెం నుంచి సాయంత్రం 5.30 గంటల తర్వాత ఖమ్మంకు పల్లెవెలుగు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కరిస్తామని డీఎం హామీ ఇచ్చారు.

సాంకేతిక సమస్యలతోనే చెల్లింపుల్లో జాప్యం

- ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ పరిధిలోని కొందరు రైతుల ఖాతాల్లో గెలల డబ్బులు జమకాకపోవాడనికి సంబంధింత బ్యాంకుల ఇంటర్నెట్ సేవల్లో అంతరాయమే కారణమని జీఎం సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండీ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు గ్రామీణ బ్యాంకు మేనేజర్లతో సంప్రదింపులు చేశామని, ఈనెల 27న ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ప్రయత్నించినా ఫలితం రాలేదని తెలిపారు. ఎస్‌బీఐ నుంచి కూడా సాధ్యం కాలేదని, యూనియన్ బ్యాంక్‌లో కూడా ప్రయత్నించి రెండు, మూడు రోజుల్లో అందరికీ నగదు జమ అయ్యేలా చూస్తామని తెలిపారు.

ఆరుగురు బైండోవర్



తహసీల్దార్ కార్యాలయంలో నాటుసారా తయారీదారులు

జూలూరుపాడు: ఆరుగురు నాటుసారా తయారీదారులను బుధవారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పలు గ్రామాలకు చెందిన నాటుసారా తయారీదారులను కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారిని తహసీల్దార్ కె.స్వాతిబిందు ఎదుట హాజరు పరిచారు. ఆరుగురు మహిళలు తాము మరోసారి నాటుసారా విక్రయించమని, ఒకవేళ పట్టుబడితే రూ.2 లక్షలు జరిమానా కానీ, జైలు శిక్షకైనా సిద్ధమని అంగీకరిస్తూ ఒక్కొక్కరూ రూ.2 లక్షల పూచీకత్తును తహసీల్దార్‌కు సమర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ములకలపల్లి: మతిస్థిమితం సరిగా లేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తాటి ఆదినారాయణ (38) మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం ఇంట్లో పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు తాటి సూరి కొండరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: టాబ్లెట్ మింగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన యం.శ్రీనివాస్ (20) ఇంట్లో ఉన్న వివిధ రకాల టాబ్లెట్లు మింగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మొండితోగు గ్రామ పంచాయతీ ధర్మాపురం గ్రామానికి చెందిన మచ్చ రాజేశ్ బైక్‌పై ఇల్లెందు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజేశ్‌ను 108 ద్వారా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు గ్రామంలోని పేకాటస్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేసి, ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామని, వారి వద్ద నుంచి రూ.5,100 నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని, ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బాదావత్ రవి వెల్లడించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,506

ముహూర్తాలకు వేళాయె..

నేటి నుంచి మాఘమాసం..
రేపటి నుంచి శుభ ఘడియలు



ఖమ్మంగాంధీచౌక్ : శుభకార్యాలకు వేళయింది. ముహూర్తాల కాలం వచ్చింది. గురువారం నుంచి మాఘమాసం ప్రారంభమవుతుండగా, శుక్రవారం నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈ మాసంలో వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు అంతా ప్రాధాన్యం ఇస్తుంటారు. 'మఘం' అంటే యజ్ఞం, యాగాదులకు మాఘమాసం ప్రత్యేకమైనది. ఇది విష్ణుమూర్తికి ప్రీతిప్రదమైన మాసం కాగా, వ్రతాలు, దేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తుంటారు.

రేపటి నుంచి బాజాల మోత..

ఈనెల 31వ తేదీ నుంచి శుభ ఘడియలు ప్రారంభమై జూన్ ఆరంభం వరకు కొనసాగనున్నాయి. ఈ సమయంలో పెళ్లితో పాటు ఇతర శుభ ముహూర్తాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మధ్యలో మార్చి 13 నుంచి ఏప్రిల్ 13 వరకు మాత్రం ఎలాంటి ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. జనవరి 31, ఫిబ్రవరి 2, 3, 7,13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. మార్చిలో 1, 2, 6, 7, 12 తేదీల్లో, ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మే లో 1, 5, 6, 8, 15, 17, 18 తేదీలతో పాటు జూన్ 1, 2, 4, 7 తేదీల్లో కూడా శుభ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఇతర శుభ కార్యాలు చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

మాఘమాసంలో వివాహాలకు ప్రాధాన్యం..

మాఘమాసం అంటే వివాహాలకు పెట్టింది పేరు. ఈ మాసంలో వివాహాలు చేసుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు ఈ కాలంలో అంతగా ఉండవు. చలితో పాటు ఎండల తీవ్రత కూడా తక్కువగానే ఉంటుంది. రైతులకు కూడా వ్యవసాయ పనులు అంతగా ఉండవు. దీంతో ఈ సీజన్‌లో వివాహాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇతర శుభ కార్యక్రమాలు జరుపుకోవటానికి కూడా అనుకూలంగా ఉంటుంది.

నూతనోత్సాహంతో సన్నద్ధం..

వివాహాది శుభకార్యాలు అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు నూతనోత్సాహంతో పలువురు ముందుకు సాగుతున్నారు. వివాహాలు తలపెట్టిన వారు సంప్రదాయ పద్ధతుల్లో పనులు ప్రారంభిస్తారు. శుభ పత్రికలు ప్రింట్ చేయించి పంపిణీకి కూడా చర్యలు చేపడుతున్నారు. వస్త్రాలు, బంగారం, వివాహానికి అవసరమైన సామగ్రి కొనుగోళ్లలో నిమగ్నమవుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ఫంక్షన్ హాళ్లను కొందరు ఇప్పటికే బుక్ చేసుకోగా, మరికొందరు బుక్ చేసుకునే పనిలో ఉన్నారు. గ్రామాల్లో ఇళ్ల ముందు వివాహాలు జరుపుకునే వారు రంగులు వేసుకోవడం, శుభ్రం చేసుకోవడం, టెంట్లు, వంట సామగ్రిని వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక బ్యాండ్, సన్నాయి మేళాలు, వీడియో, ఫొటో గ్రాఫర్లు, మండపం డెకరేషన్, వంట మనుషులు, కేటరింగ్ వంటి వాటికి అర్డర్లు ఇస్తున్నారు. విదేశాల్లో ఉండేవారు కూడా స్వదేశానికి వచ్చి మాఘమాసంలో పెళ్లిళ్లు చేసుకొని వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాఘమాసం ప్రత్యేకం



మాఘమాసం వివాహాలకు ప్రత్యేకం. ఈ మాసంలో వివాహాలు జరిపేందుకు అంతా ఇష్ట పడుతారు. జనవరి 31వ తేదీ నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. మాఘమాసంలో వివాహాది శుభ కార్యాలకు అంతా ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం సుదీర్ఘ కాలంపాటు సుముహూర్తాలు ఉన్నాయి. ఈ కాలంలో పెద్ద సంఖ్యలో వివాహాలకు నిశ్చయించుకున్నారు. జూన్ నెల ఆరంభం వరకు పెళ్లిళ్లు, ఇతర శుభ ముహూర్తాలు ఉన్నాయి.

– మునగలేటి రమేశ్ శర్మ,
ఖమ్మం జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు

ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ జితేశ్ వి.పాటిల్



హెచ్‌ఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

పాల్వంచ: ఆశ్రమ గిరిజన వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్థానిక ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి పైపుల లీకేజీ ఉండటంతో వాటిని బిగించారు. డైనింగ్ హాల్, క్లాస్ రూం పరిసరాలు, స్టోర్స్, వంట గదులను పరిశీలించారు. అన్నం, కూరలను పరిశీలించి మాట్లాడారు. వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. భోజనం వండటానికి ముందు ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలు పరిశీలించాలని, నాసిరకం సరుకులు, నాణ్యత లేకుండా ఉన్న పదార్థాలు ఎట్టి పరిస్థితుల్లోను వినియోగించొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భద్రు పాల్గొన్నారు.

అటవీ భవనానికి వందేళ్లు

శతాబ్ది ఉత్సవాలకు అటవీశాఖ సన్నద్ధం



వందేళ్లు పూర్తి చేసుకున్న అటవీశాఖ భవనం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ ప్రాంతంలో ఉన్న అటవీశాఖ పరిపాలన భవనానికి 100 ఏళ్లు నిండాయి. 1925లో నిజాం ప్రభుత్వం రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రంక్‌రోడ్డులో ఈ భవనం నిర్మించి, అటవీశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పా టు చేసింది. వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా అటవీశాఖ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించ నుంది. అందులో భాగంగా వారం రోజులు పాఠశాల విద్యార్థులతో పట్టణ ఉద్యానవనాల్లో వనదర్శిని కార్యక్రమం, పులిగుండాల ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక పర్యటనలు, కనకగిరి కొండల వద్ద పక్షులు, వన్యప్రాణుల సర్వే, ఖమ్మం అటవీ సముదాయంలో అటవీశాఖ అధికారుల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు, సత్తుపల్లి డివిజన్‌లో నూతన భవనాల ప్రారంభోత్సవాలు, ఫారెస్ట్ కాంప్లెక్స్ ఖమ్మంలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో 100 ఏళ్ల వేడుక సమావేశాల నిర్వహణ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు.

జంతు సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



విద్యార్థులకు బహుమతులను వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: జంతు సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం సారపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ తప్పిదాల వల్ల ఇప్పటికే అనేక జంతు జాతులు కనుమరుగయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న జంతు జాతులను కాపాడుకునేందుకు అందరు సహకరించాలని కోరారు. మనతో పాటుగా ఈ భూమిపై జంతువులకు కూడా జీవించే హక్కులున్నాయనే విషయాన్ని గుర్తించాలని, పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం జంతు సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీఏ డాక్టర్ సత్యప్రసాద్, పశువైద్యాధికారులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాజేందర్, హెచ్‌ఎం దూదా, ఎస్‌పీసీఏ సభ్యులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఆటో అడ్డగింత..

- బెల్టు షాపుల్లో ఎమ్మార్పీకే విక్రయించాలని ప్రజల డిమాండ్
- ఎక్సైజ్ ఎస్‌ఐ, సిబ్బందితో వాగ్వాదం



ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మితో మాట్లాడుతున్న గ్రామస్తులు

కారేపల్లి: ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బు తీసుకుని మద్యం విక్రయిస్తున్నారని, మద్యం బాటిళ్లను ఆటోల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు అడ్డుకున్న ఘటన మండలంలోని మాణిక్యారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మాణిక్యారం మాజీ సర్పంచ్ భూక్యా రంగారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉదయాన్నే గ్రామంలోకి వచ్చిన మద్యం ఆటోను అడ్డుకుని, గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించి, సుమారు రూ.2 లక్షల విలువ చేసే మద్యం బాక్స్‌లను గదిలో భద్రపరిచి తాళం వేశారు. ఆటోను పంచాయతీ గేటుకు గొలుసులతో కట్టేశారు. సమాచారం అందుకున్న కారేపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మద్యంతో పాటు ఆటోను వదిలిపెట్టాలని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఎమ్మార్పీ కంటే రూ.20 అదనంగా బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తున్నారని, వారు మరో రూ.20 అదనంగా తీసుకొని మొత్తంగా క్వార్టర్‌పై రూ.40 అదనంగా వసూళ్లు చేస్తూ దోచుకుంటున్నారన్నారు. ఇలా గతంలో జరిగిన ఓ ఘటనను సైతం ఉదాహరణగా చెబుతూ గ్రామస్తులు ఎక్సైజ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మి, సిబ్బంది వచ్చిన వాహనంలోనే వెనుతిరిగారు.

కోయచెలకలో విషాదం

- బడిలో కింద పడిపోయిన బాలిక చికిత్స పొందుతూ మృతి
- మృతిపై అనుమానాలెన్నో..



శ్రావణి (ఫైల్)

రఘునాథపాలెం: నృత్యం చేస్తూ కిందపడిపోయిన బాలిక.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని కోయచెలక గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోయచెలకకు చెందిన పొట్ట మరియమ్మ కుమార్తె శ్రావణి (15).. ఈ నెల 25న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నృత్యం చేసేందుకు తోటి విద్యార్థులతో కలిసి డాన్స్ ప్రాక్టీస్ చేస్తోంది. ఈ క్రమంలో తాను కిందపడిపోయింది. తర్వాత స్పృహలోకి వచ్చి ఇంటికి వెళ్లి తల్లి మరియమ్మతో ఒంట్లో నలతగా ఉందని చెప్పింది. దీంతో ఆమె కుమార్తెను ఆస్పత్రికి తరలించింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే, పాఠశాలలో కిందపడినప్పుడు బలమైన గాయం తగిలిందా? లేక ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తాయా? లేక గుండెపోటుతో మరణించిందా అనే తెలియడం లేదని తల్లి మరియమ్మ, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని బుధవారం పాఠశాల హెచ్‌ఎం శిరీష దృష్టికి తీసుకెళ్లగా.. శిరీష కింద పడినట్లు తనకు తెలియదని, తోటి విద్యార్థులను ఆరాతీయగా పడిపోయి తానే లేచినట్లు తెలిపారని హెచ్‌ఎం వివరించారు. శ్రావణి తండ్రి కొన్నేళ్ల కిందట మృతిచెందగా.. ప్రస్తుతం శ్రావణి మృతితో మరియమ్మ రోదనలు మిన్నంటాయి. మరియమ్మ పెద్ద కుమార్తెకు వివాహమైంది. కాంగ్రెస్ నాయకులు యండపల్లి సత్యం శ్రావణి మృతదేహాన్ని సందర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెరుకూరి పూర్ణ నివాళులర్పించారు. కాగా, మరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

భర్త ఇంటి ఎదుట భార్య దీక్ష

ప్రేమించి పెళ్లి చేసుకొని
ముఖం చాటేసిన భర్త

బోనకల్: ప్రేమించి పెళ్లి చేసుకుని, కాపురానికి తీసుకెళ్లకపోవడంతో సదరు మహిళ ఆ భర్త ఇంటి ఎదుటనే దీక్షకు దిగిన ఘటన బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బ్రాహ్మణపల్లికి చెందిన మడుపల్లి గోపికృష్ణ, కలకోట గ్రామానికి చెందిన శవల పూజిత ఏడాది కిందట ప్రేమించుకున్నారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. గోపికృష్ణ తల్లిదండ్రులు వీరి ప్రేమను అంగీకరించలేదు. అబ్బాయి బంధువులు, అమ్మాయి తల్లిదండ్రులు ఏడాది కిందట ఖమ్మంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పెళ్లి చేశారు. ఆ రోజు సాయంత్రం గోపికృష్ణ హైదరాబాద్‌లో తాను పనిచేస్తున్న ఉద్యోగం వద్దకు వెళ్లాడు. తరువాత అమ్మాయిని తీసుకెళ్తానని చెప్పి నమ్మించాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కొంత కాలం తరువాత తీసుకెళ్తానని చెప్పాడు. కానీ, తీసుకెళ్లక పోవడంతో మరోసారి పెద్దలను అడుగగా అయ్యప్ప మాల ధరించానని, తరువాత తీసుకెళ్తానని నమ్మించాడు. ఎంతకు రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోక బ్రాహ్మణపల్లిలో భర్త ఇంటి ఎదుట తల్లిదండ్రులతో కలిసి పూజిత దీక్షకు దిగింది. భర్త కుటుంబీకులు తాము చేసేదేమీ లేదని చెప్పడంతో దీక్షను కొనసాగిస్తోంది.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించాలి



డీఈఓను సన్మానిస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం : పర్యావరణంపై చిన్నతనం నుంచి అవగాహన కలిగి ఉండాలని డీఈఓ వెంకటేశ్వరచారి కోరారు. బుధవారం దుమ్ముగూడెంలో జరుగుతున్న నేచర్‌క్యాంపును ఆయన సందర్శించి మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలకు వెళ్లి విద్యార్థులు పర్యావరణం, ప్రకృతిపై అవగాహన పెంచాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు నేచర్ క్యాంపు గురించి వివరించారు. అనంతరం దుమ్ముగూడెంలోని ముత్యాలమ్మ గుడి వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికీ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజశేఖర్‌రావు, సమ్మయ్య రామారావు, శోభారాణి, పాల్గొన్నారు. కాగా, డీఈఓ వెంకటేశ్వరచారిని లక్ష్మీనగరం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

పాములను అడవిలో వదిలిన రెస్క్యూ టీం



పాములను అడవిలో వదులుతున్న సంతోష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వచ్చిన పాములను సమాచారం మేరకు ప్రాణదార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ వెళ్లి పట్టుకొని అడవిలో వదిలిపెట్టాడు. బుధవారం ఆయన ప్రజలతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జనావాసాల మధ్య పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అవగాహన కలిగి ఉండటం అవసరమని వివరించారు.

కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న మాధవ్‌నాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వేధించడం మానుకోవాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవ్‌నాయక్, పెన్నర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాకాంత్ కోరారు. బుధవారం కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు బి.రామ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇనుపనూరి నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, రాకేశ్, సృజన్, శేఖర్ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: ఫ్లైయాష్ లారీని విక్రయించేందుకు యత్నించిన ఈసం వీరస్వామి, పూనం వెంకటేశ్వర్లుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ బుధవారం కొత్తగూడెం మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత తీర్పు చెప్పారు. మణుగూరు సుందరయ్యనగర్‌కు చెందిన ముల్లంగి శ్రీనివాసరెడ్డి ఆరు లారీలు ఉండగా.. ఆయన వద్ద ఏన్కూరు మండలం ఒంటిగుడిసెకు చెందిన ఈసం వీరస్వామి ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. 2015, మే 26న పాల్వంచ నుంచి ఫ్లైయాష్ లోడు వేసుకుని ఈసం వీరస్వామి గుంటూరులోని రెంటచింతల దగ్గర చెట్టిపాలెంలో అన్‌లోడ్ చేసి, మరుసటి రోజు తిరుగుపయనమయ్యాడు. ఆ తర్వాత లారీ కనిపించకపోవడంతో 28వ తేదీన శ్రీనివాసరెడ్డి జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా అదే ఏడాది జూన్ 10న లారీ దొరికింది. పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. ఆరుగురు సాక్షులను విచారించిన అనంతరం ఈసం వీరస్వామి, ఏన్కూర్ మండలం గంగులనాచారానికి చెందిన పూనం వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్ లారీని విక్రయించేందుకు యత్నించినట్లు తేలడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని బండారు కొత్తగూడెం గ్రామానికి చెందిన జంపన్న (21) పురుగుమందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జంపన్న చదువు పూర్తి చేసి ఏడాది నుంచి ఇంటి వద్ద ఉంటుండగా.. ఈ నెల 28వ తేదీన తల్లిదండ్రులు ఏదైనా పనికి వెళ్లాలని మందలించారు. మనస్తాపం చెందిన జంపన్న పురుగుమందు తాగగా కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కిన యువకుడు

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ ధన్‌బాద్‌కు చెందిన యువకుడు కొమరెల్లి అరుణ్‌కుమార్ బుధవారం మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ మద్యం సేవించి రుద్రంపూర్‌లోని సెల్ టవర్ ఎక్కాడు. కిందకు దిగాలని స్థానికులు ఎంతసేపు కోరినా దిగలేదు. పోలీసులు అక్కడికి చేరుకుని, యువకుడికి నచ్చజెప్పి కిందకు దింపారు. సీఐ రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మద్యం మత్తులో సెల్‌టవర్ ఎక్కాడని, అతిగా మద్యం సేవించి ఉండటంతో తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు.